## జేఎన్‌టీయూహెచ్‌లో ఘనంగా అన్నదానం



**దశ, హైదరాబాద్:** జేఎన్‌టీయూహెచ్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసు సిబ్బంది రోహిణి, సంగీత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 1,420 మంది జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులకు అన్నప్రసాదం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## యాదాద్రి నగర్‌లో ఘనంగా అన్నదానం



**దశ, పెద్ద అంబర్ పేట :** పెద్ద అంబర్‌పేట పరిధిలోని యాదాద్రి నగర్‌లో మంగళవారం రాత్రి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సందడితో యాదాద్రి నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## ఇబ్రహీంపట్నంలో ఉచిత దంత వైద్య శిబిరం

❖ *150 మందికి పైగా వైద్య పరీక్షలు.. శిబిరాన్ని ప్రారంభించిన డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణకుమారి*




**దశ, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హాల్‌లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు 150 మందికి పైగా శిబిరానికి హాజరై దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ యాదగిరి, లయన్స్ క్లబ్ సభ్యులు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలత, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ కీర్తి, డాక్టర్ ఉషాశ్రీ వైద్య సేవలు అందించారు. అలాగే పీపీ యూనిట్‌కు చెందిన డాక్టర్ సమీరా అస్రా, మొబైల్ టీమ్ రోహిణి ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ కల్యాన్ తదితరులు శిబిరంలో పాల్గొన్నారు. ప్రజలకు దంత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన వైద్య పరీక్షలు, సూచనలు అందించారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో రేపు దాండియా




**దశ, ఓయూ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఉస్మానియా యూనివర్సిటీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం (2309 2026) దాండియా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, యువత, ఉత్సవ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## నాచారం దుర్గానగర్‌లో సైబర్ నేరాలపై అవగాహన




**దశ ఓయూ:** నాచారం దుర్గానగర్ లో 'గణేష్ సురక్ష సంకల్ప్-2026' కార్యక్రమంలో భాగంగా దుర్గానగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వేశ్ నేతృత్వంలో రెండో రోజు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయ్ గౌడ్, డీఐ వరుణ్ కాంత్ రెడ్డి, ఎస్ఐ మైబెల్లీ పాల్గొని ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ మోసాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మౌనిక, భవాని, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం




**దశ, రంగారెడ్డి:** చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం కీలకమని అదనపు కలెక్టర్ డాక్టర్ కే.కిరణ్మయి ఐఏఎస్ అన్నారు. 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా "మన అంగన్‌వాడీ... మన బాధ్యత" అనే థీమ్‌ను ఆమె ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషకాహారం, ఆహార వైవిధ్యం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కుటుంబాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ప్రోటీన్ ఆహారంపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహారం అందించడంతో పాటు ప్రాథమిక విద్య, ఆరోగ్యం, బాలల సమగ్ర అభివృద్ధికి కీలక కేంద్రాలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు PMMVY ప్రయోజనాలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యరత్న, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, సీడీపీఓలు, పోషణ్ అభియాన్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల చదువులకు మంచిరెడ్డి బంటీ బాసట

**దశ, యాచారం :** యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన వస్పరి మల్లేష్, సంతోష దంపతులు మృతిచెందడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి ముగ్గురు చిన్నారుల చదువులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) అండగా నిలిచారు. పిల్లల చదువుల బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చిన ఆయన, మాట ప్రకారం వారిని కళాశాలల్లో చేర్పించి విద్యాభ్యాసానికి అవసరమైన ఖర్చులను భరిస్తామని తెలిపారు. బంటీ ఆదేశాల మేరకు యాచారం మండల అధ్యక్షుడు కార్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ బాషా, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ దగ్గరుండి ముగ్గురు విద్యార్థులను నగరంలోని కళాశాలల్లో ఉచితంగా చేర్పించారు. ఇంటర్, బీటెక్ చదువులు పూర్తయ్యే వరకు సహకారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి కళాశాల చైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా నాయకుడు లింగి నర్సింహారెడ్డి, సర్పంచ్ తొట్టా రమేష్, సీనియర్ నాయకులు ఏమే బాషా, దాస్, వార్డు సభ్యులు, పార్టీ అధ్యక్షుడు కాకులారం జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కలెక్షన్‌తో 'శ్రీ రామ వస్త్రాలయం'.. ఘనంగా ప్రారంభం

❖ *పసుమములలో ఘనంగా ప్రారంభోత్సవం.. హాజరైన పలువురు ప్రముఖులు*



**దశ, పెద్ద అంబర్ పేట :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని పసుమాముల సాయివిహార్ కాలనీలో 'శ్రీ రామ వస్త్రాలయం' నూతన వస్త్ర దుకాణం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారుల కోసం కాంచీపురం, బనారస్, సాఫ్ట్ సిల్క్, ఆర్గంజా, డిజైనర్, కాటన్, డైలీ వేర్ చీరలతో నూతన కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. హోల్‌సేల్, రిటైల్ విక్రయాలతో పాటు ఆన్‌లైన్ ఆర్డర్లు, దేశవ్యాప్త డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాటసింగారం గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గ్యారాల శ్రీనివాస్‌గౌడ్, వడ్డేపల్లి విద్యా విజయేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శంకరయ్య గౌడ్, బొడిగే అశోక్‌గౌడ్, గంట శ్రీనివాస్‌రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, మజ్జిగ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## రంగారెడ్డి జిల్లాలో తొలి ఆయిల్‌పామ్ పంట కోత



**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా ఆయిల్‌పామ్ పంట కోత మహోత్సవం కేశంపేట మండలం అల్వాల గ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపునకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 4,531 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసినట్లు వెల్లడించారు.

2025-26లో 2,300 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటికే 829 మంది రైతులు 2,671 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అల్వాల గ్రామానికి చెందిన రైతు భుజంగరెడ్డి 2023 అక్టోబర్ 26న 6.5 ఎకరాల్లో 371 ఆయిల్‌పామ్ మొక్కలు నాటగా, జిల్లాలో తొలిసారిగా ఆయన తోట నుంచి పంట దిగుబడి అందింది. ఇది ఇతర రైతులకు స్ఫూర్తినిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోత మహోత్సవంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సాగు, మొక్కల సంరక్షణ, తెగుళ్ల నివారణ, ఎరువులు, నీటి యాజమాన్యం, దిగుబడి, మార్కెటింగ్‌పై శాస్త్రవేత్త బి.ఎన్.రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సురేష్, అధికారులు, వాల్యా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ మార్పుపై విద్యుత్ అధికారులకు సన్మానించిన చైర్మన్ రాములు గౌడ్

**దశ, ఓయూ:** మల్లాపూర్ చాణక్యపురి కాలనీ ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చేందుకు కృషి చేసిన విద్యుత్ అధికారులను చాణక్యపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక దుర్గామాత ఆలయ చైర్మన్ రాములు గౌడ్ ఘనంగా సన్మానించారు. హబ్సిగూడ విద్యుత్ విభాగం డీఈ సుబ్బారావు, ఏడీఈ రమేష్, ఏఈ విజయ తదితరులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయ చైర్మన్ రాములు గౌడ్, చాణక్యపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి కిషోర్ గౌడ్, కృష్ణ, నర్సింగ్‌రావు, అక్బర్ తదితరులు మాట్లాడుతూ.. కాలనీ ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వారు స్పందించారని తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన అధికారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం స్పందించి సమస్యలను పరిష్కరించే అధికారులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని వారు అన్నారు.



## శ్రీనివాస్‌నగర్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**దశ, ఓయూ:** శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సుక్క జయేందర్-కల్పన దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సుక్క జయేందర్-కల్పన దంపతులను నాయకులు అభినందించారు.

## ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

❖ *తొలి తరగతిలో 20 శాతం తగ్గుదల.. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆందోళన*



**దశ ఓయూ:** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోవడంపై బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. 2019-20తో పోలిస్తే 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో తొలి తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 45,978 మేర తగ్గిందని, ఇది దాదాపు 20 శాతం క్షీణతకు సమానమని తెలిపారు. ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టడంతో మొత్తం విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ.. తొలి తరగతిలో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరమన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవడంతోనే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారని కొమరయ్య పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓల పోస్టులు ఖాళీగా ఉండటం విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతోందో సమగ్రంగా సమీక్షించి, మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంగ్లీష్ మాధ్యమం, డిజిటల్ విద్య, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు మళ్లీ విశ్వాసం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# తాండూరుపై మళ్లీ పట్నం ఫోకస్




## మనోహర్‌రెడ్డికి చెక్..?

- యలాల్ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేందర్ రెడ్డి తో మంతనాలు
- సీనియర్లతో రహస్య మంతనాలు తెరవెనుక మారుతున్న సమీకరణాలు
- తాండూరు రాజకీయాల్లో దాదాపు రెండు దశాబ్దాల పాటు కీలక పాత్ర పోషించిన పట్నం

**తాండూర్, దశ ప్రతినిధి:** తాండూరు పాలిటిక్స్ మరోసారి ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. ఓ వైపు రాజకీయ వాతావరణం ప్రశాంతంగానే కనిపిస్తున్నప్పటికీ.. తెరవెనుక మాత్రం రాజకీయ సమీకరణాలు మారుతున్నాయన్న చర్చ ప్రస్తుతం జోరందుకుంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్రెడ్డి కదలికలు స్థానిక రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

తాండూరు రాజకీయాల్లో దాదాపు రెండు దశాబ్దాల పాటు కీలక పాత్ర పోషించిన పట్నం మహేందర్రెడ్డి మరోసారి తన రాజకీయ నెట్వర్క్ను యాక్టివ్ చేస్తున్నారన్న ప్రచారం కోడై కూస్తోంది. గతంలో తన వెంట ఉన్న పలువురు నాయకులతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారన్న వార్తలు స్థానికంగా ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.పాత అనుచరులతో వరుసగా రహస్య మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం.



యాలాల మండలానికి చెందిన ఓ సీనియర్ నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి పట్నం వర్గానికి సన్నిహితంగా ఉన్న ఓ కీలక నాయకుడితో సమావేశమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆ నాయకుడు బీఆర్ఎస్లో కొనసాగుతున్నారు. అంతే కాకుండా తాండూరు మండలానికి చెందిన ప్రస్తుత చైర్మన్ కూడా ఈ రాజకీయ మంతనాల్లో పాల్గొన్నారన్న ప్రచారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ భేటీల ఉద్దేశం ఏమిటి? భవిష్యత్ రాజకీయ వ్యూహంపై చర్చించారా? లేక కేవలం వ్యక్తిగత, రాజకీయ పరమైన మర్యాదపూర్వక సమావేశాలేనా? అన్నది మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

### నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రి

**తాండూరు రాజకీయాల్లో పట్నం మహేందర్రెడ్డికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసిన ఆయనకు నియోజకవర్గ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. అయితే తాజాగా తాండూరులో వరుసగా ప్రజా కార్యక్రమాల్లో పట్నం మహేందర్రెడ్డి పాల్గొంటుండటం కూడా రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పట్నం తన వర్గీయులతో చక్కర్లు కొడుతున్నారు. కనీసం స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి చెక్ పెట్టేలా రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్నం మహేందర్రెడ్డి చుట్టూ జరుగుతున్న రాజకీయ చర్చలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.**

# లాలాపేట్‌లో రూ.61,500కు గణపతి లడ్డూ

- లడ్డూను దక్కించుకున్న కాంగ్రెస్ నాయకుడు కిషోర్‌యాదవ్



**దశ ఓయూ:** బొడ్రాయి వద్ద శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నిమజ్జనోత్సవం సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అనంతరం స్వామివారికి సమర్పించిన గణపతి లడ్డూను వేలం వేయగా కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కిషోర్‌యాదవ్ రూ.61,500కు దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో దక్కడం ఆనందంగా ఉందని కిషోర్‌యాదవ్ తెలిపారు. గణనాథుడి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# గరివడ్డులో ఘనంగా గణనాథుని అన్నదానం



**దశ, అశ్వాపురం:** వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని రామచంద్రపురం పంచాయతీ గరివడ్డు గ్రామంలో మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నవితరణ కార్యక్రమాన్ని సర్పంచ్ దంపతులు స్వయంగా తమ చేతుల మీదుగా ప్రారంభించారు. మండపం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి మాట్లాడుతూ..గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**దశ, మునగాల:** అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా మంగళవారం కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. చిలుకూరు, కోదాడ, అనంతగిరి, నడిగూడెం, మోతె మండల కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు కార్డులను స్వయంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీ స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, స్థానిక తహశీల్దార్ సరిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు, బరాకత్ గూడెం గ్రామ సర్పంచ్ చల్లా గురవయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మెస్ డిపాజిట్ ఫీజుల పెంపును తగ్గించాలి

- కొల్లాపూర్ పీజీ సెంటర్ విద్యార్థుల డిమాండ్



**దశ, కొల్లాపూర్:** కొల్లాపూర్ పీజీ కళాశాలలో మెస్ డిపాజిట్ ఫీజుల పెంపును నిరసిస్తూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ కుమార్‌కు విద్యార్థులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల పాలమూరు యూనివర్సిటీ అధికారులు మొదటి సంవత్సరం హాస్టల్ విద్యార్థులకు మెస్ డిపాజిట్ ఫీజును అమ్మాయిలకు రూ. 16,100, అబ్బాయిలకు రూ. 18,100గా నిర్ణయించడంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..గతంలో అందరికీ మెస్ డిపాజిట్ రూ. 10,000 మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఒక్కసారిగా ఫీజులు పెంచడం వల్ల పేద విద్యార్థులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల వారు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెస్ డిపాజిట్ ఫీజులను అమ్మాయిలకు రూ. 12,000, అబ్బాయిలకు రూ. 14,000గా సవరించి రాయితీ కల్పించాలని కోరారు. విశ్వవిద్యాలయ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# బురదమయంగా రమణక్కపేట కాలనీ రోడ్డు

**దశ, మంగపేట:** మంగపేట మండలం రమణక్కపేట గ్రామంలోని బొడ్రాయి పక్క వీధి రోడ్డు తీవ్రంగా దెబ్బతిని బురదమయంగా మారడంతో స్థానిక ప్రజలు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్వల్ప వర్షానికే రోడ్డంతా నీటితో నిండి చిన్నపాటి చెరువును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధి పక్కనే ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు చిన్నపిల్లలు, విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్లు నిర్మిస్తూ "బురద రహిత గ్రామాలు"గా మారుస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని కాలనీవాసులు మండిపడ్డారు.

ఈ రోడ్డు సమస్యపై "స్వాగతం రమణక్క పేట" వాట్సాప్ గ్రూప్‌లో నిలదీయగా.. "మేము అధికారంలో ఉన్నంతవరకు మీ కాలనీకి రోడ్డు వేసే ప్రసక్తే లేదు" అని స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే రాజకీయ కారణాలతో అభివృద్ధిని అడ్డుకోవడం ఏంటని గ్రామస్థులు ప్రశ్నించారు.

# బార్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ చలకాని వెంకట్ యాదవ్‌కు ఘన సన్మానం



**దశ, ఓయూ:** తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన చలకాని వెంకట్ యాదవ్‌ను బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (BCSF) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా సన్మానించారు. సోషియాలజీ గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమానికి BCSF రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ అధ్యక్షత వహించారు.

ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్లు రాములు, కొండా నాగేశ్వర్, అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధి పోచబోయిన హరి యాదవ్, కేపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా న్యాయవాద వృత్తిలో అంచెలంచెలుగా ఎదిగి బార్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. ఆయన సేవలు బీసీ విద్యార్థులు, న్యాయవాదులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బీసీ విద్యార్థుల విద్యా, ఉద్యోగ, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ఓయూ విద్యార్థులు, పరిశోధకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# పాఠశాలకు ఉపాధ్యాయుడు డుమ్మా

- తక్కళ్లగూడెం ప్రాథమిక పాఠశాల టీచర్ తీరుపై విమర్శలు



**దశ, మంగపేట:** విద్యాబుద్ధులు బోధించాల్సిన ఉపాధ్యాయుడే బడికి ముఖం చాటేస్తుంటే, అక్కడి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. మంగపేట మండల పరిధిలోని తక్కళ్లగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి అలసత్వం, బాధ్యతారాహిత్య వైఖరిపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలో సదరు ఉపాధ్యాయుడు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రోజున కూడా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఆయన విధులకు డుమ్మా కొట్టారు.

సాధారణంగా ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెట్టాల్సి వస్తే ముందుగానే కాంప్లెక్స్ హెచ్‌ఎంకు గానీ, మండల విద్యాశాఖ అధికారికి గానీ సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. లేదా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మరొక ఉపాధ్యాయుడిని డ్యూటీ సర్దుబాటు చేసి వెళ్లడం నిబంధన. కానీ, తక్కళ్లగూడెం ఉపాధ్యాయుడు ఈ నిబంధనలేవీ పట్టించుకోకపోవడం గమనార్హం. "నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు" అన్న చందంగా ఆయన వ్యవహరిస్తున్నారని, దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారిణి మేనకను వివరణ కోరగా..సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరుకాని విషయాన్ని తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఉపాధ్యాయుడు సెలవు కావాలని గానీ, పర్మిషన్ గానీ తనను అడగలేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.